

13న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు కాకినాడలోని పిఆర్ ప్రభుత్వ కళాశాలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు 2006 డిసెంబర్ 31 తరువాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 75 కేజీల లోపు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని సూచించారు. ఎంపిక మ్యాట్పై జరుగుతుందని, కావున క్రీడాకారులు తప్పనిసరిగా మ్యాట్ షూలు తెచ్చుకోవాలని అన్నారు. ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కులిస్ట్‌తో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 25 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో కాకినాడ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

సీట్ల కేటాయింపు ఎప్పుడో.?

అదిగో ఇదిగో అంటున్న ప్రభుత్వం
నేటికీ ప్రారంభం కాని తరగతులు
నిర్లక్ష్యం తగదంటున్న విద్యార్థి సంఘాలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యా సంవత్సరం ప్రారంభమయ్యి 3 నెలలు కావస్తున్న డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వం జాప్యం వీడడం లేదు. ఈ అడ్మిషన్ల ప్రక్రియను గత నెలలో ఎట్టకేలకు చాలా ఆలస్యంగా ప్రారంభించింది. కానీ తరగతులను మాత్రం ప్రారంభించకపోవడంతో విద్యార్థులకు నేటికీ ఎదురు చూపులు తప్పడం లేదు. ఆన్ లైన్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్‌కు గత 26న తుది గడువు ఇచ్చింది. ఈ నెల 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రకటించింది. అయితే రిజిస్ట్రేషన్ గడువును మళ్లీ ఈ నెల 4 వరకూ పెంచింది. సీట్ల కేటాయింపు తొలుత 1వతేదీ అని, మరోసారి 6వ తేదీ అని, 8వ తేదీ అని చెప్పింది. తాజాగా 10వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపి మళ్లీ వాయిదా వేసింది. ఎప్పటికి స్పష్టత ఇవ్వలేదు. దీంతో డిగ్రీ చదవాలనుకుంటున్న విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను గత నెల 20 నుంచి ఈనెల 4 వరకూ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో 5 ప్రభుత్వ, 46 ప్రయివేటు డిగ్రీ కళాశాలలు, 3 అటానమస్ కాలేజీలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 6 ప్రభుత్వ, 40 ప్రయివేటు, ఒక అటానమస్, కోనసీమ జిల్లాలో 7 ప్రభుత్వ, 45 ప్రయివేటు, ఒక అటానమస్ కాలేజీ ఉన్నాయి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న కళాశాలల్లో గతేడాది సుమారు 32 వేల సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది కూడా సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,800 వరకు సీట్లు భర్తీకి అవకాశముంది. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గత నెల 20 నుంచి ఈనెల 4 వరకు ఆన్ లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 25 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ జరిపారు. ఫిజికల్ ఛాలెంజ్, సిసిసి, ఎక్స్‌ట్రా కోరిక్యులర్ యాక్టివిటీస్, ఎన్‌సిసి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్‌ను ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహించారు. కోర్సులను ఎంపిక చేసుకునేందుకు వెబ్ ఆప్షన్లకు కూడా అవకాశమిచ్చారు. గత నెల 31 కల్లా సీట్ల కేటాయింపు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెల ఒకటో తేదీ నుంచే క్లాసులు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల మరో నాలుగు రోజులకు పెంచారు.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు

జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపి ఉన్నత విద్యా మండలి 2023 నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులను అమలు చేస్తున్నారు. అయితే కొన్ని ప్రత్యేక కళాశాలల్లోనే నాలుగేళ్ల డిగ్రీ ఆఫర్ చేస్తున్నారు. మెజార్టీ కళాశాలల్లో మాత్రం మూడేళ్ల డిగ్రీ కోర్సులున్నాయి. నాలుగేళ్ల కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా ఒక్కటే ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఈ ఏడాది నుంచి నూతన విద్యా విధానం అమలవుతోంది.

సీట్ల కేటాయింపు ఎప్పుడు..?

గతంలో డిగ్రీ అడ్మిషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వారీగా నిర్వహించే వారు కాదు. గత ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లను తప్పనిసరి చేశారు. ఇంటర్‌లో కామర్స్ ఓ సబ్జెక్టుగా చదివిన వారికి మొత్తం బీకాం కోర్సుల్లో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. అలాగే ఆర్ట్స్, హ్యుమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి మొత్తం బిఏ సీట్లలో 50 శాతం, తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూపు పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో బిఏ, బికాం, బిఎస్‌సి సాధారణ కోర్సులతో పాటు, కంప్యూటర్, మార్కెట్ ఓరియంటెడ్, స్కిల్ ఓరియంటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజు ఉంటుంది. అయితే ఈ ఏడాది అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపించింది. ఎట్టకేలకు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ సీట్ల కేటాయింపు విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తరగతుల ప్రారంభం కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్షణమే డిగ్రీ తరగతులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీట్ల కేటాయింపులో ఆలస్యం తగదు

గత 3 నెలల నుంచి విద్యార్థులు చదువుకి దూరమై ఎటూ వెళ్లకుండా ఉండిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆన్ లైన్ దరఖాస్తులు పేరు చెప్పి వివిధ కారణాలు చెప్పి సీట్ల కేటాయింపులో ఆలస్యం చేస్తుంది. దీనివల్ల విద్యార్థి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. కావునా తక్షణమే డిగ్రీ సీట్ల కేటాయింపు జరగాలి. కేటాయింపు జరిగిన రోజు నుంచి ఒక వారం రోజుల వరకు విద్యార్థులకు సమయమిచ్చి సర్టిఫికెట్లు ఇచ్చి సీట్లు కన్ఫర్మ్ చేసుకోవడానికి అవకాశాన్ని ఇవ్వాలి. వెంటనే 2, 3 కౌన్సిలింగ్‌లను పూర్తి చేయాలి.

-ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

సమస్యల పరిష్కారానికి చర్యలు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలపై సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు. బుధవారం జడ్పి సమావేశ మందిరంలో జడ్పి స్థాయి సంఘ సమావేశాలు విప్పర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాని ఎంఎల్‌సిలు సోము వీర్రాజు, కుడుపూడి సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో అమలౌతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులకు సూచనలు చేశారు. రామచంద్రపురం జడ్పిటిసి ఎం.వెంకటేశ్వరరావు అకాల మరణానికి చింతిస్తూ సభ నిమిషం పాటు మౌనం పాటించింది. అనంతరం అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన జడ్పి చైర్మన్‌తోపాటు, జడ్పి సిఇఒ లక్ష్మణరావు, జిల్లా వయోజన విద్య శాఖ డిడి పాల్గొని వయోజనులను చదివించేందుకు సభ్యులందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అక్షరాంధ్ర వయోజన విద్య పుస్తకాలను జడ్పి ఛైర్మన్ ఆవిష్కరించారు. 7వ స్థాయి సంఘం చర్చలో కాలువల్లో చేపట్టిన పనులు పూడిక తీత, కొత్తగా ప్రతిపాదించిన అంశాలు, ప్రస్తుత వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు సభ్యులకు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్, రానున్న రబీ సీజనులకు కాలువలు ద్వారా నీరు సక్రమంగా పంట పొలాలకు అందేలా చూడడంతో పాటు అకాల వర్షాల వల్ల పంట పొలాలు ముంపునకు గురి కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. 4వ స్థాయి సంఘం విద్య, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి సీజనల్ వ్యాధుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు సమావేశ దృష్టికి తెచ్చారు. ఈ అంశానికి సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి వారం శుక్రవారం డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నామని వివరించారు. 3వ స్థాయి సంఘం వ్యవసాయ శాఖకు సంబంధించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సభ్యులు కోరారు. 2వ స్థాయి సంఘం గ్రామీణ అభివృద్ధికి సంబంధించిపథకాల పైన హౌసింగ్ పథకంలో చేపట్టిన పనుల పురోగతిని చర్చించారు. 5వ స్థాయి సంఘం సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల తీరుపై చర్చించారు. ఈ సమావేశంలో జడ్పి సిఇఒ వివివి ఎస్.లక్ష్మణ రావు, డిప్యూటీ సిఇఒ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

నేడు ఇటిసి నిర్వహణ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం నిర్వాహణ కమిటీ సమావేశం గురువారం జరుగుతుందని ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ కమిషనర్ రేవు ముత్యాలరాజు, శిక్షణా కేంద్రం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల జడ్‌పి సిఇఒలు, డిపిఒలు, ఇతరులు పాల్గొంటారని తెలిపారు. విస్తరణ కేంద్రంలో శిక్షణలు, అభివృద్ధి పనులపై సమీక్ష, వార్షిక శిక్షణ ప్రణాళికను ఆమోదించడం, భవిష్యత్ కార్యాచరణపై ఈ కమిటీ చర్చిస్తుందన్నారు. సమావేశం అనంతరం శిక్షణలో ఉన్న ఎంపిడిఒలతో ఆయన భేటీ అవుతారని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశం లో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వర్రే గిరిబాబు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ వర్కర్స్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నలు దిశలా పట్టణం విస్తరిస్తుందన్నారు. విస్తరణకు తగిన రీతిలో కార్మికుల నియామకాలు జరగడం లేదన్నారు. సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డుకు కనీసం ఇద్దరు కార్మికులు లేరన్నారు. దీంతో ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందన్నారు. సమయానికి వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం నాయకులు శివకోటి అప్పారావు, రమణ, రాజేష్, సింహాచలం, కృష్ణ, దొండపాటి శేఖర్, భవాని, శకుంతల, శేషారావు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు తగవు


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత శేషబాబ్జి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల సిడిపిఒ వేధింపులు తగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.చంద్రావతి అన్నారు. బుధవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం రెడ్ర సెల్ సమావేశం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో వారు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలను సిడిపిఒ మాధవి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రతి అరగంటకు ఒక ఫోటో పంపాలని వేధిస్తున్నారని అన్నారు. సాయంత్రం 4 గంటల సమయం దాటిన ఫోటోలు కోసం ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల జిల్లాలో జరిగిన రెడ్ర సెల్ సమావేశానికి తాళ్లరేవు ప్రాజెక్ట్ నుంచి యూనియన్ లీడర్లను రానివ్వకుండా సిడిపిఒ అడ్డుకున్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఇటువంటి వేధింపులు లేవని, ఇప్పటికైనా అంగన్‌వాడీల పట్ల వేధింపులు ఆపకపోతే జిల్లాస్థాయిలో పోరాటం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వాడపల్లి వీరమని, టిఎల్.పద్మావతి, నామాడి కృష్ణవేణి, పోలిశెట్టి మంగాదేవి, ప్రజా సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సామర్థ్యానికి అనుగుణంగా బోధన


స్కూల్లో తనఖీలు చేస్తున్న దేవానంద్‌రెడ్డి

ప్రజాశక్తి - శంఖవరం

విద్యార్థుల సామర్థ్యానికి తగినరీతిలో బోధన ఉండాలని కెజిబివి, సమగ్ర శిక్ష అభియాన్ కార్యదర్శి డి.దేవానంద్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏడవ తరగతి విద్యార్థులకి డిక్టేషన్ పరీక్ష నిర్వహించారు. స్వయంగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, విద్యార్థుల ఫౌండేషన్ వంటి నైపుణ్యాలను పరిశీలించి విశ్లేషించారు. అలాగే 9వ తరగతి విద్యార్థులకు సామాజిక శాస్త్రం నుంచి 'దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష వ్యతిరేకంగా పోరాటం' అనే పాఠ్యాంశం ఇచ్చి, అర్ధగంట చదవడానికి సమయం ఇచ్చారు. అనంతరం విద్యార్థులచే వారు అర్థం చేసుకున్న విషయాలను ఎంత అవగాహన ఏర్పడిందో తెలుసుకున్నారు. విద్యార్థులతోనే ప్రశ్నలు రూపొందింపజేసి, పీర్ క్వశ్చనింగ్ ద్వారా తరగతి మొత్తాన్ని చురుకుగా పాల్గొనేటట్లు ప్రోత్సహించారు. 10, 11, 12వ తరగతి విద్యార్థులకు స్లిప్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల ఆవరణ, వసతిగృహం, వంటగది, ప్రయోగశాలలు, పరిశుభ్రత ఇతర వసతులను తనిఖీ చేసి, మెరుగైన నిర్వహణకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ బాలమణి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - గండేపల్లి

భవన నిర్మాణ కార్మికులకు కూటమి పార్టీలు ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తాపీ మేస్త్రీల యూనియన్ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి పార్టీ నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి 13 నెలలు గడిచినా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికుల పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.శ్రీనివాస్, ఎన్.మహేష్, కె.స్వామి, ఎన్.ధర్మయ్య, హెచ్.హేమంత్, కె.ప్రసాద్, ఎన్.సత్తిబాబు ఎస్.గంగాధర్, టివివి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

'పిపిపి మోడల్‌ను వెనక్కి తీసుకోవాలి'

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య కళాశాలను పిపిపి మోడల్‌లో నిర్వహించే ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పాత ఎస్‌షి వసతి గృహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను పిపిపి మోడల్‌లో ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగ చేస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని రిజర్వేషన్లరను తుంగలో తొక్కే విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నీలపల్లి అప్పారావు, సత్తిబాబు, మోర్త తాతారావు, ముడుపుగంటి చినబాబు, పండు, శ్రీను, కోటి, నాగు, వేణుగోపాల్, రాజేష్, జయబాబు, పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక సూరంపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును ఇస్తామని కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజన్ జెసిఎం మురళీకృష్ణ అన్నారు. బుధవారం పాఠశాలకు అవసరమైన వాటర్ ఫిల్టర్, కుర్చీలు, ఫ్యాన్లు, టేబుల్స్, గ్రీనరీకి అవసరమైన మొక్కలను పిఠాపురం బ్రాంచ్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల మార్గానికి వంతెనను నిర్మించిన ఉపాధ్యాయుడు సీతారామరాజుని ఆదర్శంగా తీసుకుని బ్యాంకు తరపున పాఠశాలకు అభివృద్ధికి సహకరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ కోఆర్డినేటర్ శంకర్, పిఠాపురం బ్రాంచ్ బిడియం గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని పాదయాత్ర

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో తమను ఆదుకోవాలని కోరుతూ ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీనివాసరావు పాదయాత్ర చేపట్టారు. విశాఖపట్టణం నుంచి అమరావతికి పాదయాత్ర చేస్తున్న శ్రీనివాసరావు బుధవారం సామర్లకోటకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ఆటో కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని శ్రీనివాస్ కోరారు.

క్రియాశీలక సభ్యులకు అండగా జనసేన

ప్రజాశక్తి - పెద్దాపురం, జగ్గంపేట

జనసేన క్రియాశీలక సభ్యుని కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త మణికంఠ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలోనే ఆ కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కును బుధవారం తుమ్మల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కుటుంబాన్ని ఆదుకునేందుకు పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొప్పిరెడ్డి నాగబాబు, దాసు శివబాబు, ఎఎంసి వైస్ ఛైర్మన్ మాదిరెడ్డి చంద్రశేఖర్, నీటి సంఘం ఉపాధ్యక్షులు జట్లా విజయబాబు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేటకు చెందిన జనసేన కార్యకర్త సిగిరెడ్డి రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు వచ్చిన రూ.5 లక్షల బీమా చెక్కును నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొడ్డా శ్రీను, జనసేన మండల అధ్యక్షులు మరిసే రామకృష్ణ, నాయకులు గవర సుధాకర్, పాబోలు స్వామి, కురుమల్ల నాగేశ్వరావు పాల్గొన్నారు.

అన్నదానానికి 'ముదునూరి' విరాళం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


మండలంలోని ధర్మవరం గ్రామంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.5 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కమిటీకి సూచించారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు అన్న దానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన శ్రీకాకుళపు హేమ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో అన్నదానంను నిర్వహించి నట్లు తెలిపారు.

కార్టూ'నిజం'



ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా శ్రీదేవి ప్రమాణస్వీకారం


ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని నామవానిపాలెం ఉప సర్పంచ్ యాళ్ల శ్రీదేవి ఇన్‌ఛార్జ్ సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకటసూర్యనారాయణరాజు అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉపసర్పంచ్ యాళ్ళ శ్రీదేవిని ఇన్‌ఛార్జ్ సర్పంచ్‌గా ఎంపిడిఒ రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లా డుతూ గత సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఇన్‌ఛార్జ్ సర్పంచ్ గ్రామంలో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పసూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కొప్పిశెట్టి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు భూపతిరాజు రామచంద్రరాజు, వార్డు సభ్యులు వేజర్ల రామచంద్రరాజు, తాతపూడి విజయ్‌కుమార్, మేడిశెట్టి మంగ, కలవల సతీష్‌కుమార్, జెఇ రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మా వూరు వేళంగి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేళంగి పంచాయతీ కార్యాలయంలో రచయిత సవిలే రాజేష్ రచించిన 'మా ఊరు వేళంగి' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బుధవారం నిర్వహించిన ఈ సభకు సర్పంచ్ సవిలే నీలిమ అధ్యక్షత వహించారు. ఈ పుస్తకాన్ని మెర్ల వీరయ్య చౌదరి, డాక్టర్ బొండా వెంకన్నారావు ఆవిష్కరించారు. బౌద్ధ పరిశోధక రచయిత పిల్లి రాంబాబు పుస్తకంపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పాకా చంద్రరావు, డాక్టర్ కె.భానుమతి, మాజీ సర్పంచ్ ముత్యాల శ్రీనుబాబు, టిడిపి నాయకులు చంద్రు వెంకన్నరావు, బొడ్డు భాస్కర్‌రామన్, ఉప సర్పంచ్ కుంచే సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ స్టేట్ ఛైర్మన్ రామారావు

ఆదిత్యలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ శిబిరాన్ని రెడ్‌క్రాష్ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ వైడి.రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం ఆవశ్యకతను ఆయన వివరించారు. ఈ శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాతలను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అభినందించారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.21,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆత్రేయపురం గ్రామ శివారు కోటేరు పుంత రోడ్డులో పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

బిక్కవోలులో పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. కొమరిపాలెంలో ధాన్యం నిల్వ చేసే సావిడిలో పేకాడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ఏడుగురితోపాటు, యజమానిని అరెస్టు చేసి వారి నుంచి 4 బైకులు రూ.34,790 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గొల్లప్రోలు మండలం ఎకె.మల్లవరం గ్రామానికి చెందిన సిద్దా విజయబాబు అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ జివి.లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పలువురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల ప్రముఖ కూడళ్లలో వాహనాలు తనిఖీలో భాగంగా బుధవారం వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖల్లో అత్యధికంగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలను నడుపు తున్న వారిని అనుమానం వ్యక్తం చేసి బ్రీత్ ఎనరైజర్ మిషన్తో పరీక్షించారు. అత్యధికంగా మద్యం తాగిట్లు గుర్తించి ఐదుగురు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. రాము తెలిపారు.

కష్టజీవుల నేస్తం సీతారాం ఏచూరి

ప్రజాశక్తి - కాకినాడ


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కష్టజీవుల నేస్తం సీతారాం ఏచూరి అని పలువురు సాహితీవేత్తలు కవితా రూపంలో కొనియాడారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వర్మ అధ్యక్షతన 'సీతారాం ఏచూరి - సమసమాజ ఆలోచన' అనే అంశంపై కవితా సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, గరికపాటి మాస్టారు, అద్దేపల్లి ప్రభు, వేదుల శ్రీరామశర్మ, వేదుల సోమయాజులు, అద్దేపల్లి జ్యోతి, యడ్ల కుటుంబరావు, తురగా సూర్యారావు, నిట్టల ఇందిర, ఇబ్రహీం, సాధనాల చంటిబాబు, తదితరులు పాల్గొని కవితలు చదివారు. సీతారాం ఏచూరి కాకినాడ వాసి కావడం గర్వంగా ఉందన్నారు. దేశంలోనే ప్రముఖ విద్యా సంస్థ అయిన జెఎన్‌యు విద్యార్థిగా పోరుబాట నడిచి సిపిఎం అగ్రనేతగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా చరిత్ర సృష్టించారని అన్నారు. సమసమాజం కావాలని కోరుకునే వారందరికీ సీతారాం ఏచూరి స్ఫూర్తిగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు, నాయకులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్.వేణు, ఎం.నాగలక్ష్మి, కె.దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఆందోళన వద్దు

ప్రజాశక్తి - కాకినాడ

డిఎస్‌సి-2025 ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఆందోళనకు గురి కావద్దని యూటిఎఫ్ నాయకులు సూచించారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా నాయకత్వం కలెక్టర్‌ను ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులందరికీ ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి డిఇఒ, జెసిలకు ఆబాధ్యతను అప్పగిస్తానని తెలిపారు. కావున అభ్యర్థులు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తోటకూర రవిచక్రవర్తి, యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్, గిరిధర్ గోపాలరావు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంపై జాయింట్ సర్వే

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం పంచాయతీ సర్వే నెంబర్ 123, 125 లో డ్రెయినేజీ చెంతన ఉన్న స్థలం వివాదంపై ఈనెల 16వ తేదీన జాయింట్ సర్వే నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.త్రినాధరావు తెలిపారు. బుధవారం ఇరు వర్గాలతో సమన్వయ సమావేశం నిర్వహించి ఇరు వర్గాల వాదనలు విన్నారు. డ్రెయినేజీ చెంతన ఇప్పటికే 40 మంది నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారని అన్నారు. సర్వే నెంబర్ 123లో టిల్లపూడి నాగేశ్వరరావు షెడ్డు నిర్మాణం చేస్తుండగా ఇరు వర్గాల మధ్య తగాదా తలెత్తిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వివాదాస్పద స్థలాన్ని శుక్రవారం జాయింట్ సర్వే నిర్వహించి హద్దులు కేటాయించి సుంకరపాలెం పంచాయతీకి అప్పగిస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపిటిసి గుత్తుల శ్రీనివాస్, మోపూరి వెంకటేశ్వరరావు, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

ఆదిత్యలో టెక్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గండేపల్లి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్య ప్రతినిధులు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఈ నెల 15, 16 తేదీల్లో సూరంపాలెం ఆదిత్యలో నిర్వహించే 'వేద - 2క25 టెక్ ఫెస్ట్' పోస్టర్‌ను బుధవారం ప్రో. ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్ విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికితీసేందుకు దోహదం చేస్తుందన్నారు. డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వేద -2క25 లో ప్రాజెక్ట్స్, పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్స్‌తో పాటు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి, భోజనం సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు adityauniversity.in/veda 2025 వెబ్ సైట్‌ను పరిశీలించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 63032 41331, 93914 56328 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో డాక్టర్ ఎస్.రమాశ్రీ, ప్రొఫెసర్లు డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ రవి తంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

న్యాయవాదులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని స్థానిక 3వ ఆదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది సూచించారు. స్థానిక కోర్టు సముదాయంలో రూ.3 లక్షలతో నిర్మించిన క్రికెట్ ఆస్ట్రో టర్ఫ్ ప్రాక్టీస్ వికెట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. 6వ జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ బౌలింగ్ చేయగా ఆనంది బ్యాటింగ్ చేశారు. నూతనంగా క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్లో న్యాయమూర్తులు అందరూ ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. సుమారు రూ.70 వేలు విలువ చేసే ఆస్ట్రుటర్ఫ్‌ను సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ బహుకరించారు. ఈ సందర్భంగా తలాటం హరీష్‌ను న్యాయమూర్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షులు తొలేటి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పెన్షనర్ల భవనం వద్ద సూర్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉద్యోగులకు సిపిఎస్ ఇచ్చినట్లే పెన్షనర్ల ఉద్యోగులకు డిఎ, బకాయి పడిన అరియర్స్‌ను తక్షణం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ హెల్త్ కార్డులు సక్రమంగా అమలు జరగడం లేదని, నగదు రహిత హెల్త్ కార్డు అమలు జరగాలన్నారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ చేసుకోవడం వల్ల కాలయాపన జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నగదు రహిత చికిత్సకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటశాస్త్రి, ఉపాధ్యక్షుడు డి.అమృతరావు, డివివిఎస్.ప్రసాద్, పడాల వీరవెంకట సత్యనారాయణ, హెచ్‌విఆర్. జోషి, గోన చక్రరావు, ఎం.రామలింగేశ్వరరావు, టిజె.స్వామి, కంటే ఉదయ భాస్కర్‌చౌదరి, కర్రి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ప్రసాద్‌రావు, పిఇటి శ్రీనివాస్

రాష్ట్రస్థాయి పోటీలకు రీజెన్సీ విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కారైకల్ లో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14 బాలుర, బాలికల చెస్ విభాగంలో మల్లాడి శశివర్షిత, ఒంటెద్దు సుప్రియాంక, కొల్లు సాత్విక్ మణికంఠ, సాధనాల యువన్‌సంతోష్, వజ్రపు నిశాంత్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర, బాలికల చెస్ విభాగంలో కోడి వేదహర్షిని, సాధనాల లాస్యకమలని, పట్టా దాక్షిణ్య ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాద్‌రావు, పిఇటి బొట్టా శ్రీనివాస్ అభినందించారు.

శ్మశాన వాటికలో పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శెట్టిబలిజి కాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటికలో మౌలిక వసతులకు సంబంధించిన పనులకు టిడిపి నేతలు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు మాట్లాడుతూ శ్మశాన వాటికలో నీటి సౌకర్యం నిమిత్తం బోరు, షెడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీను మణిబాబు, నాయకులు దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోం చిన్నారులకు ఫ్రాన్స్ పౌరులు అన్నదానం నిర్వహించారు. యానాంకు చెందిన పంపన శాంతకుమారి, నాగేశ్వరరావు దంపతుల జ్ఞాపకార్థం ఫ్రాన్స్ పౌరసత్వం గల వారి కుమారులు పంపన నాగరాజు, రామకిశోర్ బుధవారం హోం చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. స్వయంగా చిన్నారులకు భోజనాలు వడ్డించి ఆనందం వ్యక్తం చేశారు. వారి ఔదార్యానికి సంస్థ డైరక్టర్, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులతో బ్యాంకర్ల సమావేశం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జెఎంఎల్‌బిసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగ్గంపేట సెక్టార్ పరిధిలోని బ్యాంకర్లు పాల్గొని రుణాలు, తదితర అంశాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవిఎస్. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దుర్గారావుకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని పోలేకుర్రు పాఠశాల నుంచి పాతకోరంగికి బదిలీ అయిన ఉపాధ్యాయుడు వి.దుర్గారావును ఘనంగా సత్కరించారు. బుధవారం పోలేకుర్రు ఎంపిపి పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్ వెంట్రు శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పాఠశాల హెచ్‌ఎం పెంకే అమ్మాజీ ఆయన చేసిన సేవలను కొనియాడారు. అవే సేవలను భవిష్యత్‌లోనూ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు రత్తయ్య, దుర్గారావు, శ్రీను, విఆర్ఎన్‌బి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ,


ఇఒను కలిసిన జ్యోతుల

టిటిడి ఇఒను కలిసిన జ్యోతుల

ప్రజాశక్తి - జగ్గంపేట

టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే సింఘాల్‌ను టిటిడి ఇఒగా నియమించింది. ఈ నేపథ్యంలోనే ఇఒను టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల కలిసి అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.